కానాలలో ప్రగతి పరుగులు

- రూ.9.70 కోట్లతో అభివృద్ధి పనులు
- డీబీటీ,నాన్ డీబీటీ విధానంలో రూ.36 కోట్ల సంక్షేమ లబ్ధి
- సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు


రైతు భరోసా కేంద్రం,


నాడు-నేడుతో రూపురేఖలు మారిన ఎంపీ యూపీ పాఠశాల


ఎస్సీ కాలనీలో ఏర్పాటైన సీసీ రోడ్డు

నంద్యాల(అర్బన్): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి పథంతో పయనిస్తున్నాయి. గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు అందుబాటులోకి వచ్చాయి. గ్రామ సచివాలయం, వలంటీర్ వ్యవస్థల ఏర్పాటులో ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ గ్రామ ముంగిటకే అందుతుండడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారు. నంద్యాల మండలంలోని మేజర్ పంచాయతీ కానాల గ్రామం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకు పోతుంది. నాలుగున్నరేళ్లలో కానాల 1, 2 సచివాలయాల పరిధిలో సుమారు రూ.9.70 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.1.10 కోట్లతో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. రూ.86 లక్షలతో గ్రామ సచివాలయాలు రూ.43 లక్షలతో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. జగనన్న లేఅవుట్‌లో 500 మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేసి ఇళ్లు మంజూరు చేశారు. నాడు-నేడు కింద రూ.75 లక్షలు ఖర్చుచేసి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించారు. నాలుగున్నరేళ్లలో వివిధ పథకాల ద్వారా కింద డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా 15,166 మందికి రూ.36 కోట్ల నగదు వారి ఖాతాల్లో జమైంది.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణ పనులు జరిగాయి. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాయి. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నారు.

– విజయశేఖర్‌రెడ్డి

రైతులకు అండగా ఉన్నారు



జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులంతా సంతోషంగా వ్యవసాయం చేస్తున్నారు. గ్రామంలోనే ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులోకి వచ్చాయి. పండించిన పంటకు గిట్టుబాటు ధరలు కల్పిస్తున్నారు. పంట పెట్టుబడికి ముందే రైతు భరోసా పేరుతో ఆర్థిక సాయం చేస్తుండటం అభినందనీయం.

– దూదేకుల కాశీం, రైతు, కానాల

సచివాలయ వ్యవస్థ బాగుంది



సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ పథకాలను గ్రామ వలంటీర్లు సకాలంలో తెలియజేస్తున్నారు. ఏ సమస్య వచ్చినా వలంటీర్ దృష్టికి తీసుకెళ్తే సచివాలయాల ద్వారా పరిష్కారం అవుతున్నాయి. మండల కేంద్రానికి వెళ్లే అవస్థలు తప్పాయి. దాదాపు పనులన్నీ ఇక్కడే అవుతున్నాయి.

–మధుబాబు గౌడ్, కానాల

ప్రారంభానికి ముస్తాబు

- రూ.13.50 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే గంగుల, మాజీ ఎమ్మెల్సీ
- చాగలమర్రి, డి.వనిపెంట, ముత్యాలపాడులో ప్రారంభోత్సవాలు


ముత్యాలపాడులో రైతు భరోసా కేంద్ర భవనాలు

చాగలమర్రి: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలో సుమారు రూ.13.50 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. ఇందులో సచివాలయ, రైతు భరోసా కేంద్ర భవనాలు, సీసీ రోడ్లు, సూపర్ డ్రైనేజీలు, ధోబీ ఘాట్ నిర్మాణం, బోర్లు, తాగునీటి కోసం పైప్‌లైన్ పనులను పూర్తి చేశారు. వాటిని ఆదివారం ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ముత్యాలపాడులో 2 సచివాలయ, రైతుభరోసా కేంద్ర భవనాలు, 8 సీసీరోడ్లు, ఎం.తండాలో సీసీరోడ్లు, చక్రవర్తులపల్లెలో సీసీ రోడ్లు, రూ.1.55 కోట్ల వ్యయంతో నిర్మించగా, డి.వనిపెంట నుంచి చెంచుగుడెం వరకు రూ.4.కోట్లతో వంతెన, సచివాలయ భవనం, డి.కొత్తపల్లెలో 4 సీసీ రోడ్లు, ఓజీ తండాలో సీసీ రోడ్లు, పెద్దవంగలిలో సచివాలయం, ఆర్‌బీకే భవనాలు, 2 సీసీ రోడ్లు, చిన్నవంగలిలో 8 సీసీ రోడ్లు, ఓవర్ హెడ్ ట్యాంకు, చాగలమర్రిలో 4 సచివాలయ భవనాలు, 14 సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేశామని పంచాయతీరాజ్ శాఖ ఏఈ కొండారెడ్డి తెలిపారు. అలాగే పెద్దబోధనం నుంచి తోడెండ్లపల్లె గ్రామానికి రూ.3.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు వారు భూమి పూజ చేసి శంకుస్థాపన చేయనున్నారని చెప్పారు. ముత్యాలపాడులో ఏర్పాటైన జగనన్న కాలనీలో లబ్ధిదారులకు 221 మందికి పట్టాలు పంపిణీ చేసి వారికి పక్కా గృహాల నిర్మాణానికి రుణాలు కూడా మంజూరు చేశారు. వాటిలో 70 గృహాల నిర్మాణాలు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఎం.తండాలో నీటి సౌకర్యం కోసం బోరుతోపాటు సబ్‌మెర్సిబుల్ మోటారును అమర్చారు. మజరా గ్రామమైన చక్రవర్తులపల్లెలో బోరు, మోటారు మరమ్మత్తు పనులు చేపట్టారు. ముత్యాలపాడులో శివాలయం వద్ద , బీసీ కాలనీలో సీసీరోడ్లు, జగనన్న పాత కాలనీలో పైప్‌లైన్, మోటారు ఏర్పాటు, ధోబీఘాట్ నిర్మాణానికి రూ.4 లక్షలతో బోరు,మోటారు, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని వివరించారు.


డి.వనిపెంటలో నిర్మించిన వంతెన


చాగలమర్రిలో నిర్మించిన 4వ సచివాలయ భవనం

క్లుప్తంగా

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఇంజేడులో శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని సుద్దమల్ల, ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ గ్రామాల్లో వెలిసిన ఆలయాల్లో శనివారం మాఘమాసం చివరి వారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి, శ్రీ అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన, ఆకుపూజలు చేశారు. అర్చకులు కమలేష్‌శర్మ, అనంతయ్య, లక్ష్మణస్వామి, భాస్కరశర్మ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు

రుద్రవరం: రుద్రవరం-అప్పనపల్లె దారిలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామి, మహాత్రిపుర సుందరి మానస లింగేశ్వర స్వామి అమ్మవార్లకు శనివారం భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే అర్చకులు స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించిన అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తాదులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు


తుడుమలదిన్నెలో బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ, ఎస్‌ఐ

ఉయ్యాలవాడ : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన తుడుమలదిన్నె, ఉయ్యాలవాడలో శనివారం కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. వీరి వెంట ఆళ్లగడ్డ రూరల్ సీఐ హనుమంత్‌నాయక్, ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి, బీఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ ఫరీందర్, షరీఫ్ ప్రజలను అప్రమత్తం చేస్తూ రానున్న ఎన్నికల్లో శాంతియుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


చాగలమర్రిలో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తులసమ్మ

చాగలమర్రి: స్థానిక పాత ఎస్సీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం, జీపీ, ఉపాధి నిధులు రూ.20లక్షలతో రాజు ఇంటి నుంచి శ్రీరాములు ఇంటి వరకు, బుగ్గ రస్తాలో ఖీజర్ ఇంటి నుండి వాజీద్ ఇంటి వరకు, సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాల సమీపంలోని అష్రాఫ్ నగర్ కాలనీలో జిగ్గిగారి ఇబ్రహీం ఇంటి నుంచి చాకలి నర్సమ్మ ఇంటి వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం భూమి పూజ చేశారు. సర్పంచ్ తులసమ్మ, జేసీఎస్ నంద్యాల జిల్లా కో-ఆర్డినేటర్ షేక్ బాబులాల్, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ పనులను ప్రారంభించారు. కో-ఆప్షన్ సభ్యుడు జి.ఇబ్రహీం, ఎంపీటీసీ ఫయాజ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా, ప్రచారకార్యదర్శి పెయింటర్ రఫీ పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలి

నంద్యాల(అర్బన్): అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరను అనుసరించి వంట గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం రూ.500కే ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చింతలయ్య కోరారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వినియోగదారులకు రూ.500 కే సిలిండర్‌ను అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం మహిళల ఓట్లు రాబట్టేందుకు సిలిండర్‌పై రూ.100 తగ్గిస్తున్నామని ప్రకటించడం దారుణమన్నారు. సిలిండర్ ధరను పూర్తి స్థాయిలో తగ్గించి అందజేయాలని డిమాండ్ చేశారు.

నేడు కోత పండుగ

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని హోలీ క్రాస్ క్యాథడ్రల్ పాస్టేట్-2 (ఆల్ సెయింట్ చర్చి) ఆలయంలో కోత పండుగను జరుపుతున్నట్లు డీనరీ చైర్మన్ ఇమ్మానియేల్, సెక్రెటరీ కిరణ్ కుమార్, బాలన్న శనివారం తెలిపారు. వారు మట్లాడుతూ ఆదివారం ఉదయం ఏడు గంటలకు ఆరాధన కార్యక్రమం ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథులుగా నంద్యాల డయాసిస్ అధ్యక్షులు ఇన్‌చార్జ్ బిషప్ ఐజక్ వరప్రసాద్ దైవ సందేశం ఇస్తారని చెప్పారు. మధ్యాహ్నం 12 గంటకు ప్రేమ విందుతో పాటు కోత పండుగ జరుగుతుందని వివరించారు.

గడ్డివాముల దగ్ధం

చాగలమర్రి: తోడేండ్లపల్లె గ్రామంలో దస్తగిరి స్వామి దర్గా సమీపంలోని కల్లంలో ఏర్పాటు చేసుకున్న 3 గడ్డి వాములు ప్రమాదవశాత్తు శుక్రవారం అర్ధరాత్రి అగ్ని ప్రమాదంలో కాలి బూడిదయ్యాయి. గ్రామానికి చెందిన గూడిగి ఓబులపతి, ఎస్.రామకృష్ణ అనే రైతులు ఏర్పాటు చేసుకున్న గడ్డి వాములకు మంటలు చెలరేగడంతో సమాచారమందుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. శనివారం ఉదయం వరకు అక్కడే ఉండి మంటలను పూర్తిగా ఆర్పివేశారు.

నంద్యాలను అభివృద్ధి చేసి చూపుతున్నాం

నంద్యాల(సిటీ): పట్టణాన్ని గతానికంటే మిన్నగా అభివృద్ధి చేసి చూపుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా అన్నారు. శనివారం పట్టణంలోని పలు వార్డులలో రూ.1.26.6 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు.

- 12వ వార్డు బాలాజీ కాంప్లెక్స్ వెనుక రూ.35 లక్షలతో సీసీ రోడ్డు, డ్రైన్, మారుతీ టౌన్ షిప్ వద్ద రూ.39 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ గోపాల్‌రెడ్డి, కౌన్సిలర్ శ్యాంసుందర్‌లాల్‌తో కలిసి భూమి పూజ చేశారు.
- 29వ వార్డు బొగ్గులైన్‌లో రూ.18లక్షలతో సీసీ రోడ్డు, మంచినీటి పైప్‌లైన్, డ్రైన్ నిర్మాణాలకు వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ జలీల్ బాషా ఆధ్వర్యంలో పనులను ప్రారంభించారు.
- 25వ వార్డు సాయిబాబ నగర్‌లో రూ.14.6 లక్షలతో కౌన్సిలర్ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో రోడ్డు, డ్రైన్ నిర్మాణాన్ని ప్రారంభించారు.
- 23వ వార్డు నూనెపల్లెలో రూ.20లక్షలతో సీసీ డ్రైన్ నిర్మాణానికి కౌన్సిలర్ లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ పార్థుడుతో కలిసి భూమి పూజ చేశారు.

టీడీపీ ఖాళీ

- ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్న యువత
- తాజాగా వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


యువకుడికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి

నంద్యాల: పట్టణంలో టీడీపీ నానాటికీ ఆదరణ కోల్పోతుంది. నాలుగున్నర సంవత్సరాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులైన యువత టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతుండడంతో నంద్యాల పాత పట్టణంలో ఆ పార్టీ ఖాళీ అవుతుంది. 5వ వార్డు నడిగడ్డ ప్రాంతానికి చెందిన 50 కుటుంబాలకు చెందిన యువత కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓల్డ్ టౌన్ ప్రాంతంలో రూ.2 కోట్లకు పైగా నిధులను వెచ్చించి మెయిన్ రోడ్డు ఏర్పాటు చేశామని, ప్రతి వీధిలో సీసీ రోడ్డు, డ్రైనేజీలు, కల్వర్టులు సొంత నిధులతో శిల్పా మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు. ఇమాం బాషా, సమీర్ బాషా, సోహెల్, ఫిరోజాఖాన్, హుసేన్, మాబాషా, మౌలానా, మన్సూరాఖాన్, మహ్మమ్మద్, అలీ పాల్గొన్నారు.

మాజీ మంత్రి శిల్పా సమక్షంలో చేరికలు..

పట్టణంలోని దేవనగర్, శ్యాం నగర్, వీసీ కాలనీలకు చెందిన యువకులు మాజీ మంత్రి శిల్పా మోహన్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా సమక్షంలో శనివారం టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారు మాట్లాడుతూ మళ్లీ వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని జగనన్నను ముఖ్యమంత్రిగా కొనసాగించుకుందామని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ చంద్రశేఖర్, దేవనగర్ బాషా, మాజీ కౌన్సిలర్లు జాకీర్ హుసేన్, దిలీప్ కుమార్ పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే శిల్పా రవి

కమనీయం ఆది దంపతుల కల్యాణం


రామాలయంలో కాశీవిశ్వనాథుడు, విశాలాక్షి స్వామి అమ్మవార్లకు కల్యాణం జరిపిస్తున్న దృశ్యం


కాళికాంబ దేవాలయంలో..


చాగలమర్రి రామలింగేశ్వరస్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): ఆది దంపతులైన శివ పార్వతుల కల్యాణం పట్టణంలోని శైవక్షేత్రాల్లో శుక్రవారం అర్ధరాత్రి అనంతరం మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలం అనంతరం వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు, రాత్రి జాగారణ, శివనామస్మరణలతో గడిపారు. ప్రథమనందీశ్వర దేవాలయం, సోమనందీశ్వర దేవాలయం, సమజీవనగర్ రామాలయం, ఎన్‌కే రోడ్డులోని నాగలింగేశ్వర ఆలయం, రోజాకుంటలోని నాగలింగేశ్వర ఆలయం, మల్లికార్జునస్వామి దేవాలయం, కాళికాంబ చంద్రశేఖర దేవాలయం తదితర ఆలయాల్లో శనివారం తెల్లవారుజామున 4గంటల వరకు కల్యాణోత్సవ కార్యక్రమాలను నిర్వాహకులు జరిపించారు. వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు.

చాగలమర్రి : మహాశివరాత్రి పండుగను పురస్కరించుకొని స్థానిక పాత శివాలయంలో శనివారం తెల్లవారు జామున శివ,పార్వతుల కల్యాణం కమనీయంగా జరిపించారు. వేద పండితులు జగదీశ్‌శర్మ ఆధ్వర్యంలో తలంబ్రాల తంతు ముగించారు. ముత్యాలపాడు బస్టాండు సమీపంలో వెలసిన శ్రీబ్రహ్మంగారి మఠంలో శనివారం మధ్యహ్నం అన్నదానం చేశారు. కమిటీ పెద్దలు పెద్ద నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి, చిన్న పీరయ్య, గుత్తి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


మల్లికార్జున స్వామి ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న పండితులు

11న మార్కెట్ వేలాలు

రుద్రవరం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ నెల 11వ తేదీన మార్కెట్ వేలాలు నిర్వహిస్తామని ఈఓ సుబ్బారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మేజర్ పంచాయతీకి సంబంధించి దినసరి,వారపు సంత మార్కెట్, గేటు వసూళ్లకు వేలాలు ఉంటాయని చెప్పారు. పాల్గొనదలచిన వారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. అలాగే కబేలాకు రూ.10వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలో కలుషిత నీరు పంపిణీ కాకుండా చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు. శనివారం సోషల్ మీడియాలో వచ్చిన కథనాలకు అనుగుణంగా బిలాల్ నగర్ నేషనల్ కళాశాల వద్ద నీరు కలుషితం కావడానికి గల కారణాలను మున్సిపల్ డీఈ శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. రెండు, మూడు నీటి కనెక్షన్లు మురుగు కాల్వ గుండా పోవడం గుర్తించి వాటిని తొలగించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. కాచి వడబోసిన నీటినే తాగాలని ప్రజలకు సూచించారు. అనంతరం సచివాలయ సిబ్బంది సహకారంతో ఇంటింటికీ ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఆశలకు ఊపిరి

- కీలక దశలో వివిధ రకాల పంటలు
- తెలుగుగంగలో మోస్తరు నీటి ప్రవాహం
- పంటలకు తడులందిస్తున్న రైతులు


17వ బ్లాక్ కాల్వలో పారుతున్న నీరు

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాల రైతులు రబీ సీజన్‌లో బోరు మోటార్ల కింద మంచి దిగుబడులు సాధించాలనే ఆశలతో వరి,మొక్క జొన్న, మినుము, కొర్ర వంటి పంటలు సాగు చేశారు. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, వాటికి తోడు ఎండలు తీవ్రం కావడంతో భూగర్భ జలాలు అడుగంటాయి. దీంతో బోరు మోటార్ల నుంచి నీరు అంతంత మాత్రంగానే వస్తోంది. పంటలకు సరిపడ తడులు అందక పంటలు వాడు ముఖం పడుతున్నాయి. దీంతో పెట్టుబడులు నష్టపోతామనే ఆందోళన రుద్రవరం, అప్పనపల్లె, పెద్దకంబలూరు,డీ.కొట్టాల,శ్రీరంగాపురం,కోటకొండ తదితర గ్రామాల పరిధిలోని రైతుల్లో నెలకొంది. ఇలాంటి సమయంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తాగునీటి అవసరాల నిమిత్తం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నుంచి ఈ నెల 6న తెలుగుగంగ కాల్వ ద్వారా రుద్రవరానికి సమీపంలో నల్లమల అటవీ ప్రాంతంలోనున్న గండ్లేరు జలాశయానికి నీటిని విడుదల చేసింది. మూడు రోజులు కాగానే నీటి విడుదలను నిలిపేశారు. అయినప్పటికీ కాల్వలో మోస్తరుగా నీటి ప్రవాహముంది. ఆ నీరు రైతుల ఆశలకు ఊపిరి పోసింది. ప్రధాన కాల్వలోని నీటిని ఉప ప్రధాన కాల్వలకు మళ్లించుకొని పంటలకు తడులందిస్తున్నారు. మరి కొందరు ప్రధాన కాల్వలో అడ్డు కట్టలు వేసి నీటిని నిలువరించి ఆయిల్ ఇంజిన్లు, మోటార్ల ద్వారా పంటలకు తరలిస్తున్నారు.

గట్టెక్కినట్లే..



కోటకొండ గ్రామ సమీపంలో తెలుగు గంగ ప్రధాన కాల్వకు దగ్గరలో మూడున్నర ఎకరాల పొలంలో ఖరీఫ్‌లో మొక్కజొన్న పంట సాగు చేశా. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం విడతల వారీగా కాల్వకు నీటిని విడుదల చేయడంతో మంచి దిగుబడులు లభించడం, ధర భాగుండటంతో అధిక లాభాలు గడించాను. వెంటనే రెండో పంటగా మినుము సాగు చేశా. ఆ పంట కూడా పండింది. బోరు ఉండటంతో మూడో పంటగా కొర్ర పంట సాగు చేశా. అయితే ఇప్పుడిప్పుడే ఎండలు అధికం కావడంతో బోరు నుంచి నీరు అరకొరగా వస్తోంది. తడులు ముందుకు సాగడంలేదు. నష్ట పోతామనుకున్న సమయంలో ప్రభుత్వం మూడు రోజుల క్రితం కాల్వకు నీటిని విడుదల చేసింది. నీరు నిలిపివేసినా కొంత పారుతోంది. ఆ నీటిని మోటార్ సాయంతో పంట తడుపుకున్నా. ఇక పంటకు ఎలాంటి ఢోకా లేదు. గట్టెక్కినట్లే.

– సంతోష్,రైతు,డీ.కొట్టాల


శ్రీరంగాపురం వద్ద బోరు కింద సాగు చేసిన వరి పంట


చెంచుగూడెం సమీపంలో ఏపుగా పెరిగిన మినుము పైరు